క్లుప్తంగా

వరద బాధితులకు రూ.50 వేల విరాళం

నెల్లూరు(బారకాసు): విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం రూ.50 వేల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు ఏపీయూడబ్ల్యూజే తరఫున అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందుజనార్దన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

9న వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని బ్రాహ్మణవీధిలో గల గురునిలయంలో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు మాకాని గోపీచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకయ్యస్వామి వారి నామసంకీర్తనతో భిక్షాటన కార్యక్రమాన్ని నగరంలో ఆదివారం నిర్వహించనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

చెక్కు అందజేత



నెల్లూరు(అర్బన్): పేదలకు ఐదు బస్తాల బియ్యాన్ని అందజేసేందుకు గానూ రూ.7500 చెక్కును ఎల్ఐసీ సీఏబీ బ్రాంచ్ కార్యాలయ మేనేజర్ ప్రసన్నకుమార్‌కు ఏఓఐ నేతలు శుక్రవారం అందజేశారు. నగరంలోని పూలే విగ్రహ సమీపంలో గల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఓఐ నేత నరసింహారావు మాట్లాడారు. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్లోని ఉద్యోగులు, ఏజెంట్లు కలిసి వంద బస్తాల బియ్యాన్ని అభాగ్యులు, ఆశ్రమాలకు ఏటా అందజేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ఈ మొత్తాన్ని అందజేశామని వివరించారు. నేతలు రాజు, రమేష్‌బాబు, దేవరకొండ శ్రీనివాసులు, రమణయ్య, వెంకటేశ్వర్లు, శివకుమార్, పెంచలయ్య, రజనీకాంత్, వెంకటయ్య, అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న సత్యవాణి

నెల్లూరు(సెంట్రల్): గ్రామాల్లోని రైతులకు క్షేత్ర స్థాయి వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలను అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రంలో ఇందుకూరుపేట, నెల్లూరు సబ్ డివిజన్ల వ్యవసాయ సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు రైతులు పండించే వివిధ పంటల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని చెప్పారు. అధికారులు సుబ్బారెడ్డి, మాలకొండయ్య, శివన్నారాయణ, కిరణ్‌కుమార్ రెడ్డి, నర్సోజీ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి చేస్తా

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



బుచ్చిరెడ్డిపాళెం: పాఠశాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న అరుణమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. శుక్రవారం పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రహరీ నిర్మించేందుకు స్థల పరిశీలన చేశామన్నారు. విద్యార్థినులకు బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి బోరు కావాలని టీచర్ల కోరగా, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా త్వరలో వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

➡ కోవూరు: స్థానిక పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత సమస్యలను తన దృష్టికి తెచ్చారని, వాటిని పరిష్కరిస్తామని అరుణమ్మ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఎంపీడీఓ శ్రీహరి ఎంపీపీ పార్వతి, ఎంపీటీసీ వేణు తదితరులు పాల్గొన్నారు.

తరలుతున్న బొజ్జ గణపయ్యలు













వినాయక చవితిని ఘనంగా జరుపుకొనేందుకు నగర వాసులు సిద్ధమయ్యారు. గణనాథుడి ప్రతిమలను కొనుగోలు చేసే వారితో నగరంలో కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించేందుకు బొజ్జ గణపయ్య విగ్రహాలను సందడి వాతావరణం నడుమ తరలిస్తున్నారు.

– నెల్లూరు(బృందావనం)

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ



నెల్లూరు (టౌన్): నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో గల మున్సిపల్ పార్కులో మొక్కలను కేఎన్నార్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు శుక్రవారం నాటారు. అమ్మ పేరుతో మొక్క నాటుదాం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో కేఎన్నార్ హైస్కూల్ నుంచి రిత్విక్ ఎన్‌క్లేవ్ వరకు ర్యాలీని జరిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ నరేంద్రబాబు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు ప్రక్రియను సవరించాలి

నెల్లూరు (టౌన్): యాభై కిలోమీటర్లు దాటి సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సరైన రవాణా సౌకర్యం లేక మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇదే విషయమై డీఈఓకు వినతి పత్రాన్ని సమర్పించామని తెలిపారు.

పొన్నవోలు నియామకంపై హర్షం

నెల్లూరు (లీగల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని నియమించడంపై పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కోర్ కమిటీ మాజీ సభ్యుడు కుడుముల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నెల్లూరు(అర్బన్): పొదలకూరు రోడ్డులోని గౌతమ్‌నగర్‌లో గల హరిత వృద్ధాశ్రమంలో వృద్ధులకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, నేతలు సుబ్బారావు, మహబూబ్‌బాషా, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నరాల వ్యాధులపై అవగాహన



నెల్లూరు (లీగల్): నరాల వ్యాధులపై న్యాయవాదులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో గల బార్ అసోసియేషన్ కార్యాలయంలో నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యురాలు బిందుమేనన్ మాట్లాడారు. పక్షవాతం రాకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని జేసీ భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జేసీఐ, జీవన యోగశాల ఆరోగ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ పూండ్ల రమేష్, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రొఫెసర్ లక్ష్మీప్రసన్న, రామాయణం మహేష్‌స్వామి, జేసీఐ నేషనల్ డైరెక్టర్ కోట సత్యం, రీజినల్ చైర్మన్ చలువాది శరత్‌కుమార్, జేసీఐ నెల్లూరు టౌన్ అధ్యక్షుడు మెంటా రమణ, జోన్ ట్రెజరర్ సత్యం, జీవనయోగశాల ట్రస్ట్ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

నెల్లూరు సిటీ: వినాయక చవితిని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కాంక్షించారు. ఈ మేరకు ప్రజలకు వినాయక చవితిని శుభాకాంక్షలను తెలియజేశారు.

నెల్లూరు(బారకాసు): విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో జిల్లా వాసులు సుఖసంతోషాలతో ఉండాలని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలను తెలియజేశారు.

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలియజేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు (టౌన్): నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సును న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ర్యాగింగ్, గుడ్.. బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, బాలల హక్కులు తదితరాలపై సీనియర్ సివిల్ జడ్జి వాణి అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ శంకరయ్య, ఉపాధ్యాయుడు జోషీ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్‌కు వైద్య పరీక్షలను స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మందికి వైద్య పరీక్షలను డాక్టర్లు సత్యనాథ్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి జరిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి అనంతరావు, గుర్రం వెంకటసురేంద్రబాబు, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు, కోశాధికారి అరిగెల సాయిరామ్, నేతాజీ సుబ్బారెడ్డి, కనకట్ల రఘురామ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వినాయక చవితి వేడుకలు



విశ్వసాయి స్కూల్లో..



కేబీఆర్ స్కూల్లో..

నెల్లూరు (టౌన్): నగరంలోని పలు విద్యాసంస్థల్లో ముందస్తు వినాయక చవితి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు.

• చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని విశ్వసాయి స్కూల్లో వినాయక చవితి వేడుకలతో పాటు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ జాన్సన్, డీన్ రఘురామ్, వైస్ ప్రిన్సిపల్ భవాని పాల్గొన్నారు.

• బాలాజీనగర్‌లోని నలంద స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ ముజహర్, డైరెక్టర్ ఫహీం, వసీమ్ పాల్గొన్నారు.

• నగరంలోని కేబీఆర్ స్కూల్లో విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి మల్లికాబేగం, కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

శివాజీ సెంటర్‌లో కొలువుదీరిన దుర్గా గణపతి



నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని శివాజీ సెంటర్‌లో 18 అడుగుల దుర్గా గణపతిని శుక్రవారం ప్రతిష్ఠించారు. హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి ప్రత్యేకంగా తీర్చిదిద్దిన గణనాథుడ్ని ప్రతిష్ఠించామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. సురేంద్రరెడ్డి, సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రావు, రంగరాజన్, మధుసూదన్, పురుషోత్తం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

‘సీఎమ్మార్’లో పూతరేకుల గణనాథుడు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(బృందావనం): కనకమహల్ సెంటర్‌లోని సీఎమ్మార్ షాపింగ్ మాల్లో పూతరేకుల గణనాథుడ్ని కొలువుదీర్చారు. ఈ సందర్భంగా సంస్థల నిర్వాహకుడు మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ పెంచలయ్య శుక్రవారం మాట్లాడారు. కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం నుంచి 2500 పూతరేకులను ప్రత్యేకంగా తెప్పించి గణపతిగా తీర్చిదిద్దామని చెప్పారు. పండగ అనంతరం వీటిని భక్తులకు ప్రసాదంగా అంజేయనున్నామని వివరించారు.

• నగరంలోని సీఎమ్మార్ షాపింగ్ మాల్లో మట్టి గణపతి ప్రతిమలను ఎస్పీ కృష్ణకాంత్ పంపిణీ చేశారు. ఈ ఏడాది సుమారు పది వేల మట్టి వినాయక విగ్రహాలను అందజేయనున్నామని సీఎమ్మార్ అధినేత మావూరి శ్రీనివాసరావు తెలిపారు. నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, మేనేజర్ వాసు, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మట్టి గణపతులను ఆల్తూరు గిరీష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• గాంధీబొమ్మ సమీపంలోని వెంకట్రామా బుక్‌షాప్ వద్ద గురు, శుక్రవారాల్లో ఎనిమిది వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశామని సంస్థ అధినేత శ్రీపతి శ్రీనివాసరావు తెలిపారు. డీపీఓ సుస్మిత, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మోహన్‌రావు, టీపీఎస్ కల్యాణ సదన్ ఫౌండర్ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు

నెల్లూరు(బారకాసు): వినాయక విగ్రహాల నిమజ్జనం రోజున భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయనున్నామని కమిషనర్ సూర్యతేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలోని గణేష్ ఘాట్, పెన్నా బ్యారేజీ వద్ద నిమజ్జనం కోసం పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. భారీ క్రేన్లు, మరబోట్లు, గజ ఈతగాళ్లు, బ్యారికేడ్లు, లైటింగ్, సీసీ కెమెరాలు తదితరాలను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని కాంక్షించారు.